సంపుటి :02 సంచిక :182 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

గురువారం 11 , సెప్టెంబర్ 2025



## కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం

కాజీపేట రైల్వే డివిజన్, భూపాలపల్లికి కొత్త రైల్వే లైన్లు ఏర్పాటు చేయాలి

04

రైల్వే బైపాస్ లైన్ లకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి

వరంగల్ ఎంపీ డా కడియం కావ్య

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

10 మంది మావోయిస్టులు మృతి

మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత మోడెం బాలకృష్ణ

ఆయన స్వస్థలం హనుమకొండ జిల్లాలోని మడికొండ

వివరాలు వెల్లడించిన రాయ్‌పూర్ రేంజ్ ఐజీ అమ్రేష్ మిశ్రా

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి తుపాకుల మోతతో దద్దరిల్లింది. గరియాబంద్ జిల్లా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ సహా 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బ అని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

– అక్షర దర్బార్, హనుమకొండ



5




## బిగుస్తున్న పిడికిలి




### నకిలీ విత్తన విక్రేతలపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం

రైతుల జీవితాలతో చెలగాటమాడుతూ నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తున్న మోసగాళ్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రైతులకు నాశిరకం విత్తనాలు, ఎరువులు అంటగట్టాలని చూస్తే పీడీ యాక్ట్‌తో పాటు, పలు బీన్ ఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా దాడులు ముమ్మరం చేశారు. నకిలీ విత్తనాల విక్రయాలపై దృష్టి సారించారు. ఇటీవల వరంగల్, మట్టెవాడ పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సుమారు రూ.78 లక్షల విలువైన నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన పురుగుమందులు పట్టుబడ్డాయి. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠా ఐదేళ్ల నుంచి రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. అలాగే గీసుకొండ మండల పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తున్న మరో రెండు ముఠాలను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.63 లక్షల విలువైన నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

- ఉమ్మడి జిల్లాలో ముమ్మరంగా దాడులు
- మట్టెవాడలో రూ.78 లక్షల సరుకు పట్టివేత
- గీసుకొండలో రూ.63 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- నిందితుడిపై పీడీయాక్ట్ నమోదు
- 'నకిలీ' విక్రయాలను సహించం: సీపీ సన్‌ప్రీత్ సింగ్

02

### అల్లుడి చేతిలో మేనత్త హతం

కుటుంబ కలహాలే కారణం

03



### గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లుల ఆమోదంపై కేసులో తీర్పు రిజర్వ్



# అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

**- తేజస్వీ స్కూల్ లో ఘటన**



అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని తేజస్వి హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థి అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు. తెలిసిన వివరాల ప్రకారం.. పోలేపల్లి జయంతి వర్ధన్ (15) అనే విద్యార్థి రోజూలాగానే బడికి వచ్చాడు. కొంత సేపటి తర్వాత విద్యార్థి చెవి, ముక్కు నుంచి రక్తం రావడాన్ని సిబ్బంది గుర్తించారు. దీంతో యాజమాన్యం, ఉపాధ్యాయులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయాడు. తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# TUF యాత్రను విజయవంతం చేయాలి

**నర్సంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి గూబ రాజు**

అక్షర దర్బార్, నల్లబెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఈ దిశగా జరుగుతున్న TUF యాత్రను విజయవంతం చేయాలని నర్సంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి గూబ రాజు కోరారు. నల్లబెల్లి మండల కేంద్రంలో ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్, ఉచిత బస్సు–రైలు పాస్ సౌకర్యం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ హామీలను నిలబెట్టుకోవడానికి ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. నల్లబెల్లి మండలంలోని ఉద్యమకారులు యాత్ర విజయవంతం చేయడానికి సిద్ధం కావాలని గూబ రాజు పిలుపునిచ్చారు.






# బిగుస్తున్న పిడికిలి

- నకిలీ విత్తన విక్రేతలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం
- ఉమ్మడి జిల్లాలో ముమ్మరంగా దాడులు
- మట్టెవాడలో రూ.78 లక్షల సరుకు పట్టివేత
- గీసుకొండలో రూ.63 లక్షల విలువైన సరుకు స్వాధీనం
- నిందితుడిపై పీడీయాక్ట్ నమోదు
- 'నకిలీ' విక్రయాలను సహించం : సీపీ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : రైతుల జీవితాలతో చెలగాటమాడుతూ నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తున్న మోసగాళ్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రైతులకు నాశిరకం విత్తనాలు, ఎరువులు అంటగట్టాలని చూస్తే పీడీ యాక్ట్‌తో పాటు, పలు బీన్ఎస్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లవ్యాప్తంగా దాడులు ముమ్మరం చేశారు. నకిలీ విత్తనాల విక్రయాలపై దృష్టి సారించారు. ఇటీవల వరంగల్, మట్టెవాడ పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సుమారు రూ.78 లక్షల విలువైన నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన పురుగుమందులు పట్టుబడ్డాయి. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠా ఐదేళ్ల నుంచి రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. అలాగే గీసుకొండ మండల పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తున్న మరో రెండు ముఠాలను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.63 లక్షల విలువైన నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

### - ఇతర చట్టాలు.. శిక్షలు ఇలా..

నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయదారులపై పోలీసులు పలు బీఎన్ఎస్ చట్టాల కింద కేసులు పెడతారు. బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 334 ప్రకారంజ.. నకిలీ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించినట్లు రుజువైతే, దోషులకు న్యాయస్థానం కనీసం ఆరు నెలల జైలు శిక్ష విధిస్తుంది. నేర తీవ్రతను బట్టి ఆ శిక్ష ఐదేళ్ల వరకూ పొడిగించబడే అవకాశం ఉంది. అంతేకాకుండా, దోషికి రూ.50,000 నుంచి రూ.10 లక్షల వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది. ఒకవేళ నకిలీ సరుకుల కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితే, న్యాయస్థానాలు అదనపు శిక్షలు కూడా విధిస్తాయి.

### - రైతులు అప్రమత్తంగా ఉండాలి : సీపీ సన్ ప్రీత్ సింగ్


రైతులు మోసగాళ్ల చేతుల్లో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సీపీ సన్ప్రీత్ సింగ్ హెచ్చరిస్తున్నారు. గుర్తింపు పొందిన, నమ్మకమైన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలని కోరారు. ఏదైనా అనుమానం వస్తే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్ లేదా వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

### - పీడీ యాక్ట్ అంటే ఏమిటి?

**సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేరగాళ్లపై పోలీసులు ఉపయోగించే అత్యంత కఠినమైన చట్టాల్లో పీడీ యాక్ట్ ఒకటి. ఒకసారి ఒక వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదైందంటే, ఇకపై పోలీసులు ఆ వ్యక్తిని ఎలాంటి విచారణ లేకుండా నిర్బంధంలో ఉంచవచ్చు. సాధారణంగా ఒక నేరం జరిగితే, పోలీసులు విచారణ జరిపి నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తారు. కానీ పీడీ యాక్ట్ కింద, నేరం చేయకముందే లేదా అతడు నేరం చేస్తాడనే అనుమానంతో పోలీసులు అరెస్ట్ చేయవచ్చు. ఈ యాక్ట్ కింద పోలీసుశాఖకు ఒక వ్యక్తిని 12 నెలల వరకు జైల్లో ఉంచే అధికారం ఉంటుంది. యాక్ట్ అమలు చేసే అధికారం జిల్లాస్థాయిలో పోలీస్ కమిషనర్ లేదా ఎస్పటీ లేదా కలెక్టర్ కు ఉంటుంది.**

### - నిందితులపై పీడీ యాక్ట్..

**రైతులను మోసం చేస్తూ, నకిలీ విత్తనాలు అంటగడుతున్న ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఇటీవల గీసుకొండలో రూ.63 లక్షల విలువైన నకిలీ విత్తనాలు విక్రయించిన కేసులో హైదరాబాద్కు చెందిన ముద్దంగుల ఆదిత్యపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్ పీడీ యాక్ట్ నమోదు చేయించారు. నిందితుడిపై గతంలోనూ కేసులు నమోదయ్యాయి. గతంలో అనేక కేసుల్లో పట్టుబడి, న్యాయస్థానాల ద్వారా శిక్షలు అనుభవించి కూడా ఎలాంటి మార్పు లేకుండా నేరాలకు పాల్పడేవారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ (పీడీ) యాక్ట్ తో పాటు ఇతర బీఎన్ఎస్ చట్టాల కింద కూడా కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరిస్తున్నారు.**






# 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలి

**: ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

హనుమకొండ, అక్షర దర్బార్: స్థానిక సంస్థల ఎన్నికలు 42 శాతం బీసీ రిజర్వేషన్లతో నిర్వహించాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ ఓంకార్ భవన్ నుంచి చౌరస్తా వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉన్నా కేవలం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అన్యాయం అని అన్నారు. బీసీలకు రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చి తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కి మెమోరాండం అందజేశారు.

# 42 శాతం రిజర్వేషన్ గవర్నర్ ఆమోదానికి ధన్యవాదాలు

**బీసీ సంక్షేమ సంఘం భూపాలపల్లి జిల్లా ఇంచార్జీ విజయగిరి సమ్మయ్య**



అక్షర దర్బార్ మల్హర్ : బడుగు బలహీన వర్గాల 42 శాతం రిజర్వేషన్ గవర్నర్ ఆమోదానికి జాతీయ బీసీ సంఘం భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి విజయగిరి సమ్మయ్య ధన్యవాదాలు తెలిపారు. గురువారం కొయ్యూరు లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘాల పోరాటం ద్వారా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ 42 శాతం రిజర్వేషన్ స్థానిక సంస్థలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదించి ప్రత్యేక తెలంగాణ ఇచ్చినట్టుగా తెలంగాణ బీసీల గుండెలో చిరస్థాయిగా నిలిచిపోయే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బీసీల రిజర్వేషన్ కల సహకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, బీసీ మినిస్టర్లను ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలకు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ కు బీసీ బిల్లు ఆమోదం తెలిపినందుకు తెలంగాణ జర్నలిస్టులందరికీ తెలంగాణ బీసీ బలహీన వర్గాల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అల్లుడి చేతిలో మేనత్త హతం

## - కుటుంబ కలహాలే కారణం

అక్షరదర్బార్, వెంకటాపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో మేనత్తపై కత్తితో దాడి చేసి ఆమెను హతమార్చిన యువకుడి ఘటన గురువారం ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో చోటుచేసుకున్నది. వెంకటాపురం సీఐ ముత్యం రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వీఆర్కే పురం పంచాయతీ ఇప్పగూడెం గ్రామానికి చెందిన కొండగొర్ల ఎల్లక్క(55), ఇదే గ్రామానికి చెందిన అల్లుడు కొండ గొర్ల విజయ్ మధ్య గొడవలు జరుగుతున్నాయి. తాజాగా వాళ్లిద్దరి మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన విజయ్ తన మేనత్తపై కత్తితో దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన ఎల్లక్క తీవ్రమైన రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థినీలు అన్ని రంగాలలో రాణించాలి

## : డా. ఈసం నారాయణ



అక్షర దర్బార్, నర్సంపేట: విద్యార్థినీలు చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాలలో రాణించాలని ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా. ఈసం నారాయణ సూచించారు. గురువారం నర్సంపేటలోని బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్య సాధనకు ఎన్ఎస్ఎస్ అద్భుత వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, డ్రగ్స్ వంటి దుష్ప్రవర్తనలను సమాజం నుంచి నిర్మూలించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మోర్తాల రామరాజు మాట్లాడుతూ నూతన విద్యార్థులు తప్పనిసరిగా ఎన్ఎస్ఎస్‌లో చేరి విశ్వవిద్యాలయం నిర్వహించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు.



# రైతులకు అండగా బీఆర్ఎస్

- అన్నదాతలకు యూరియా అందించాలి
- వారిపై అక్రమ కేసులు పెట్టొద్దు
- పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



అక్షరదర్బార్, పరకాల: కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత మాటలకు మోసపోయిన రైతులు ఇప్పుడు గోస పడుతున్నారని, ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ రైతులకు పూర్తి అండగా నిలుస్తుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం పరకాల పట్టణంలోని ఎస్ జె గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా, గురువారం మృతి చెందిన పరకాల మాజీ జడ్పీటీసీ సభ్యుడు సీలువేరు మొగిలి మరణం పట్ల ఆయన సంతాపం ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్రంలో రైతులకు కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన నీటి ప్రాజెక్టులు ఆనందం చేకూర్చాయి. అయితే, కాంగ్రెస్ పాలనలో ఇప్పుడు రైతులు యూరియా కొరతతో రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది," అన్నారు.

### "ఎమ్మెల్యే పీఏ పీఏనా, మినిస్టరా?"

పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు బదులుగా ఆయన పీఏ అధికారం చలాయిస్తున్నారని ధర్మారెడ్డి ఆరోపించారు. "ప్రభుత్వ అధికారులను బెదిరించడం, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవడం వంటి చర్యలు అతను తీసుకుంటున్నాడు. ప్రజలతో సంబంధం లేని వ్యక్తి ఇంత అధికారాన్ని ఎలా కలిగి ఉన్నాడో ప్రజలకు తెలియాలి," అని ధర్మారెడ్డి ప్రశ్నించారు.

### - యూరియా అందక ఎమ్మెల్యేపై ఆగ్రహం

రైతులకు తగినంత యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన ఆయన, పరకాల నియోజకవర్గంలో రైతులు రెండురోజులుగా ధర్నాలు చేస్తున్నా ఎమ్మెల్యే స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతులు యూరియా కోసం పోరాడుతుంటే, వారిపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని మేము సహించం. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యేపై ఉద్యమానికి సిద్ధంగా ఉంటాం," అని హెచ్చరించారు. "రైతులపై అక్రమ కేసులు పెట్టొద్దు. ప్రభుత్వం వారి పక్షంలో ఉండాలి. బీఆర్ఎస్ పార్టీ రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది," అని ధర్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల, నడికుడ, దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మాజీ జెడ్పీటీసీ మొగిలికి నివాళి

అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందిన పరకాల మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నేత సిలివేరు మొగిలి పార్థివదేహాన్ని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వెంకటాపూర్ లో సందర్శించి పూల మాలవేసి నివాళులర్పించారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన మొగిలి అకాల మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. మొగిలి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



# బీజేపీ నాయకుల పరామర్శ

అక్షర దర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గంలోని అలియాబాద్ గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మణరావు, జంగిలి వెంకట రాజేశ్వరరావులు ఇటీవల మృతి చెందగా గురువారం వారి నివాసానికి బీజేపీ రాష్ట్ర నాయకులు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ అభ్యర్థి డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. విజయ చందర్ రెడ్డి, డా. సిరంగి సంతోష్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షులు కాసాగాని రాజ్‌కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు కొమ్మిడి మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి రాజేందర్ రావు, మండల కోశాధికారి ఏదునూరు లింగయ్య, గ్రామ మాజీ సర్పంచులు జంగిలి ప్రకాష్‌రావు, జంగిలి దేవేందర్‌రావు, భూత్ అధ్యక్షులు అంబరగొండ శీను తదితరులు పాల్గొన్నారు.

# దళారులకు అడ్డాగా బ్యాంకులు

## సీపీఐ నాయకుడు మంద భాస్కర్



అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రాల్లో ఉన్నటువంటి బ్యాంకులు దళారులకు అడ్డగా మారాయని సిపిఐ నాయకులు మంద భాస్కర్ ఆరోపించారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేస్తూ కేసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులకు పంట పండించేందుకు డబ్బులు లేక నాన్న ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని దళారులు మీ ఇబ్బందులను మేమే తీరుస్తామంటూ మాయమాట చెపుతూ బ్యాంకు సిబ్బందితో కుమ్మక్కైన దళారులు రైతులను మోసం చేస్తూ వాళ్ళ దగ్గర కమిషన్ పేరుతో వేల రూపాయలు కాజేస్తున్నారన్నారు. దళారుల ఆగడాలను అరికట్టాలని, సంబంధిత బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

# మల్లూర్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్ మల్లూర్: మల్లూర్ మండల నూతన ప్రెస్ క్లబ్ కమిటీ గౌరవ అధ్యక్షులు వీరమనేని సంపత్ రావు ఆధ్వర్యంలో మండల నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక గురువారం ఉదయం మండల కేంద్రమైన తాడిచెర్ల లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బుర్ర సుధాకర్ గౌడ్ (వార్త), ఉపాధ్యక్షులుగా రాగం కుమార్ (స్టార్ 9 న్యూస్), ప్రధాన కార్యదర్శిగా ముడితనపెల్లి ప్రభాకర్ (సూర్య), కోశాధికారిగా జల్లారపు ప్రసాద్ (ప్రజాపక్షం), గౌరవ అధ్యక్షుడిగా వీరమనేని సంపత్ రావు (మహన్యూస్), జాయింట్ సెక్రటరీగా మదుగురి నాగరాజు (ప్రజాజ్యోతి), కార్యవర్గ సభ్యులుగా చొప్పరి రాజయ్య, చిందం భాస్కర్, లింగన్నపేట శ్రీనాథ్, రావుల ఆంజనేయులు, గద్దం ప్రదీప్ ఎన్నికయ్యారు.



# గ్రూప్-1 పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

## బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ముస్కె రాము



అక్షర దర్బార్, పరకాల: గ్రూప్-1 పరీక్షలో జరిగిన అక్రమాలను తప్పుపడుతూ, హైకోర్టు తీర్పు మేరకు పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ముస్కె రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ టిజీపీఎస్సీ నిర్లక్ష్యంతో అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, కోఠి మహిళా కళాశాలలో 71 మంది ఎంపిక కావడం, మిగిలిన 26 కేంద్రాల్లో 139 మంది మాత్రమే ఎంపిక కావడం అనుమానాలకు తావిస్తోందన్నారు.ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులకు ఎక్కువ అవకాశం దక్కగా, తెలుగు మీడియం విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. టిజీపీఎస్సీ చైర్మన్ సహా సభ్యులు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, ప్రభుత్వం పై ఒత్తిడి పెంచుతూ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్వి పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు

# పనులు అడ్డుకోలేదని చెప్పడం హాస్యాస్పదం

## : మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్

అక్షర దర్బార్, శాయంపేట: మైలారం గ్రామంలోని పెద్ద చెరువు కట్ట పనులు తాము అడ్డుకోలేదని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గడిపె విజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ వారు, కాంట్రాక్టరే స్వయంగా పనులు నిలిచిపోయినట్టు ఒప్పుకున్నారని, అయినా పనులు అడ్డుకోలేదని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. హుస్సేన్‌పల్లి–మైలారం బీటీ రోడ్డు పనులు ఆగిపోయి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నా కాంగ్రెస్ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. చిల్లర రాజకీయాలు చేస్తూ అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ దూదిపాల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పంట పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తల

అక్షర దర్బార్ శాయంపేట : తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వరంగల్ శాస్త్రవేత్తల బృందం శాయంపేట మండలంలోని మైలారం, జోగంపల్లి గ్రామాలో పత్తి, వరి,మొక్కజొన్న పంటలను సందర్శించారని మండల వ్యవసాయ అధికారి గంగా జమున తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త మరియు కోఆర్డినేటర్ డా..ఎ.విజయ భాస్కర్ మాట్లాడుతూ... పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వడలు,తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రా. లీ నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారి చేసుకోవాలనీ సూచించారు. కాయ కుళ్ళు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రా. మరియు 1 గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ పది లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలనీ సూచించారు.పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి ఆరు నుండి ఎనిమిది లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించడం జరిగింది.అలాగే రసం పీల్చేచే పురుగుల నివారణకై వేప నూనె (1500 పి పి ఎం) ఎకరాకు లీటర్ మందు చొప్పున లేదా అసిఫేట్ ఎకరాకు 300 గ్రాములు చొప్పున లేదా ఫ్లనికామైడ్ 0.25 మీ. లీ. చొప్పున 200 lit నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్న లో కత్తెర పురుగులు , ఆకు మాడు తెగులు గమనించడం జరిగింది.కత్తెర పురుగు నివారణకు ఎమమెక్టిన్ బెంజోయేట్ మందు ఎకరాకు 80 గ్రా చొప్పున మొవ్విలో పడే విధంగా పిచికారి చేసుకోవాలని అలాగే ఆకుమాడు తెగులు నివారణగా ప్రాపికోనజోల్ అనే మందును ఎకరాకి 200ఎం ఎల్ పిచికారి చేయాల్సిందిగా సూచించారు. వరి పంటలో కాండం తొలచు పురుగు మరియు పాము పొడ తెగులు ఆశించడం జరిగింది. కాండం తొలిచిపురుగు నివారణకు క్లోరాంట్రనిలిప్రోలు 0.3 మి లీ చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.పాము పొడ తెగులు నివారణకు వాలిడా మైసిన్ 2 మి లీ చొప్పున లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలని సూచించారు.శాస్త్రవేత్తలు డా..వెంకట రాజకుమార్, డా.ఆర్. విశ్వతేజ, ఎ ఈ ఓ అన్వేష్ పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.





# టేకుమట్లలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడి

## – అక్షర దర్బార్ కథనానికి స్పందన

అక్షర దర్బార్, టేకుమట్ల: మండల కేంద్రంలో పోలీసులు ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టారు. గురువారం రాత్రి ఒకటిగంట సమయంలో ఇసుక లోడుతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని, వాటి యజమానులైన గజ్జి కుమార్, బండి రఘుపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. అదే విధంగా సాయంత్రం నుండి వావిలాలకు పర్మిషన్ లేకుండా ఇసుక తరలిస్తున్న మహేందర్, సురేందర్ రెడ్డి ట్రాక్టర్లను కూడా సీజ్ చేసి, వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టేకుమట్ల ఎస్సై మాట్లాడుతూ అక్రమ రవాణా చేసే వారిని ఉపేక్షించేది లేదని, కేసు నమోదు చేసి కోర్టులో ఫైల్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.



# కాజీపేటలో బస్టాండ్ నిర్మాణం

- కాజీపేట రైల్వే డివిజన్, భూపాలపల్లికి కొత్త రైల్వే లైన్లు ఏర్పాటు చేయాలి
- రైల్వే బైపాస్ లైన్ లకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి
- వరంగల్ ఎంపీ డా కడియం కావ్య



అక్షరదర్బార్, వరంగల్: హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టుల పురోగతిని.. పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపైన జరిగిన సమీక్ష సమావేశంలో భాగంగా వరంగల్ కు సంబంధించి రైల్వే సమస్యలపై ఎంపీ డా కడియం కావ్య ప్రస్తావించారు. ప్రధానంగా కాజీపేట రైల్వే స్టేషన్ ముందు బస్టాండ్ నిర్మాణం చేపట్టాలన్నారు. రైల్వేకు సంబంధించిన స్థలం బస్టాండ్ నిర్మాణానికి కేటాయిస్తే.. దానికి బదులుగా మరో చోట రైల్వేకు స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీ తెలియజేశారు. అందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు కూడా సానుకూలంగా స్పందిస్తూ మరో ప్రాంతంలో స్థలం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజలు, రైల్వే ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మల్టీ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి సహకరించాలని ఎంపీ కోరారు. రైల్వే శాఖ మంత్రి దీనికి సంబంధించి ఆదేశాలను కూడా సంబంధిత జోనల్ అధికారులకు అందజేస్తామని వెల్లడించారు. భూపాలపల్లికి కొత్త రైల్వే స్టేషన్, రైల్వే లైన్‌ను మంజూరుపై ఎంపీ ప్రస్తావించారు. భూపాలపల్లి సింగరేణి కాలరీస్, జెన్ కో నుంచి బొగ్గును రవాణా చేయడానికి ట్రక్కులపై ఆధారపడుతుందన్నారు. రైల్వే లైన్ మంజూరు అయితే రోడ్డు ప్రమాదాలు, కాలుష్యం, సరుకు రవాణా ఖర్చులను తగ్గిస్తుందని, ప్రయాణీకుల ప్రయాణంతో పాటు ఆర్థిక కార్యకలాపాలను పెంచుతుందని తెలిపారు. కాజీపేటను రైల్వే డివిజన్ చేస్తే రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రయాణం, వాణిజ్యా రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తాయని ఎంపీ కడియం కావ్య అన్నారు.

నష్కల్ నుండి వరంగల్ నగరానికి రెండు రైల్వే బైపాస్ లైన్లు, ఒకటి నష్కల్ నుండి చింతపల్లి వరకు, నష్కల్ నుండి హసన్ పర్తి వరకు రైల్వే డిపార్ట్మెంట్ ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఓఆర్ ఆర్ నిర్మాణం కారణంగా ఇప్పటికే రైతులు నష్టపోయారని అన్నారు. మరోసారి ఈ రైల్వే లైన్ల కారణంగా రైతులు మరిన్ని భూముల కోల్పోయి వ్యవసాయ రంగం చిన్న భిన్నం కానుందన్నారు. ట్రయాంగిల్ రైల్వే విధానంతో వరంగల్ నగర అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. అక్కడి రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అలైన్మెంట్ మార్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రాన్స్ పోర్ట్ అండ్ బిల్డింగ్స్ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# దారంతా కంకరే..

- ట్రాక్టర్, టిప్పర్ల ద్వారా కంకర రవాణా
- ఓవర్ లోడ్, అడ్డదిడ్డంగా డ్రైవింగ్ తో రోడ్డుపై పడుతున్న కంకర
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అక్షర దర్బార్ శాయంపేట :శాయంపేట మండలంలోని వివిధ గ్రామాలకు ట్రాక్టర్లు ఓవర్‌లోడ్‌తో కంకర తీసుకెళ్తున్నారు.తీసుకెళ్లే క్రమంలో రోడ్లపై పడుతుండటంతో చిన్న వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నది.రోడ్లపై మట్టి, ఇసుక, కంకర ముఖ్యంగా కొత్త నిర్మాణాల సమయంలో లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో భారీగా కంకరను తరలిస్తున్నారు.ఈ ఓవర్‌లోడ్ వాహనాలు రోడ్లను పాడు చేయడమే కాకుండా వాహనదారులకు, ప్రయాణికులకు ముప్పుగా మారాయని వాహనదారులు బెంబేలెత్తుతున్నారు.రోడ్లపై పడిపోయిన కంకర వల్ల ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు.సంబంధిత అధికారులు స్పందించి ఓవర్ లోడుతో వెళ్తున్న వాహనాలను అప్రమత్తం చేయాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.





# బాధిత కుటుంబానికి రూ. లక్ష చెక్కు అందజేత

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన గాజుల అరుణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎన్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్ రావు అరుణ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అరుణ కొన్నేళ్లుగా ఎన్ ఎస్ ఆర్ డెయిరీ లో పనిచేస్తుంది. మానవతా దృక్పథంతో స్పందించిన ఎన్ ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్ రావు రూ.లక్ష చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో అందజేశారు.

# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలపై కీలక నిర్ణయం

**- హైకోర్టు తీర్పుపై అప్పీల్ కు టీజీపీఎస్సీ సన్నద్ధం**

అక్షరదర్బార్, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని లేదా పరీక్షలను రద్దు చేసి మళ్ళీ నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయించింది. ఈరోజు జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు పునర్‌మూల్యాంకనం చేస్తే సాంకేతికపరమైన సమస్యలు తలెత్తుతాయని కమిషన్ అభిప్రాయపడింది. అంతేకాకుండా, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, నిబంధనలను ఉల్లంఘించిందని, ఫలితంగా తెలుగు మాధ్యమ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని సింగిల్ జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. ఈ అంశాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి టీజీపీఎస్సీ అప్పీల్‌కు వెళ్లనుంది.



# రైతులు అధైర్య పడొద్దు

**- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్**

అక్షర దర్బార్, మరిపెడ: ప్రభుత్వ యంత్రాంగం అంతా రైతుల కోసం అహర్నిషలు కృషి చేస్తోందని, రైతులు అధైర్య పడకుండా సంయమనం పాటిస్తూ అధికారులతో సహకరిస్తూ యూరియాను తీసుకెళ్లాలని మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. గురువారం ఆయన మరిపెడ సొసైటీని సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రతి రైతుకు యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రత్యేక అధికారి కిరణ్, ఏవో వీరాసింగ్, సీఐ రాజ్ కుమార్, ఎస్ఐ బొలగాని సతీష్ ఉన్నారు.



# ఛత్తీస్ గఢ్ లో భారీ ఎన్ కౌంటర్

- 10 మంది మావోయిస్టులు మృతి
- మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత మోడెం బాలకృష్ణ
- ఆయన స్వస్థలం హనుమకొండ జిల్లాలోని మడికొండ
- వివరాలు వెల్లడించిన రాయ్ పూర్ రేంజ్ ఐజీ అమ్రేష్ మిశ్రా



అక్షరదర్బార్, హనుమకొండ: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యం మరోసారి రక్తం చిందింది. భద్రతా దళాలు, మావోయిస్టులు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోడెం బాలకృష్ణ సహా 10 మంది మావోయిస్టులు మ`తిచెందారు. రాయ్‌పూర్ రేంజ్ ఐజీ అమ్రేష్ మిశ్రా తెలిపిన వివరాల ప్రకారం.. గరియాబంద్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందని సమాచారం అందుకున్న ఛత్తీస్ గఢ్ పోలీసు ఉన్నతాధికారులు గురువారం స్పెషల్ టాస్క్ ఫోర్స్, కోబ్రా భద్రతా బలగాలను ఆ ప్రాంతంలో మోహరింపజేశారు. జవాన్లు కూంబింగ్ ఆపరేషన్ చేపడుతుండగా, వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగారు. రెండు వర్గాల మధ్య సుమారు అరగంట పాటు భీకర పోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలంలో మావోయిస్టు పార్టీ అగ్రనేత మోడెం బాలకృష్ణతో పాటు మరో తొమ్మిది మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మృతి చెందిన వారిలో పార్టీ ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండు ఉన్నట్లు కూడా పోలీసులు ప్రకటించారు. ఈ ఎన్ కౌంటర్ లో మావోయిస్టు పార్టీ కీలక నేతలే ఉన్నట్లు తెలుస్తోంది.

**- విద్యార్థి దశలోనే ఉద్యమంలోకి..**

మోడం బాలకృష్ణ అలియాస్ మనోజ్ స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ గ్రామం. విద్యార్థి దశలోనే ఆయన రాడికల్ ఉద్యమాలకు ఆకర్షితుడయ్యాడు. పీపుల్స్‌వార్ పార్టీలో చేరి అనతి కాలంలోనే కీలక నేతగా ఎదిగాడు. నాడు శాఖమూరి అప్పారావు, పటేల్ సుధాకర్‌రెడ్డి సహా ఆయన కూడా అరెస్ట్ అయి జైలులో ఉన్నప్పుడు.. వారిని విడిపించుకునేందుకు మావోయిస్టు పార్టీ పలువురు వీఐపీలను కిడ్నాప్ చేశారు. దీంతో పోలీసు శాఖ ముగ్గురు మావోయిస్టు పార్టీ నేతలను బయటకు పంపించింది. బాలకృష్ణ మరణంతో ఆయన స్వస్థలం మడికొండలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

# 22 నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



అక్షరదర్బార్, హనుమకొండ: ఓరుగల్లు కాకతీయ రాజధాని కాకతీయుల ఆరాధ్య అధిష్ఠావ దేవి సుప్రసిద్ధ పంచాక్షరి దేవాలయం శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో నాగిళ్ళ వారి వంశపారం పర్య అర్చకత్వంలో వివిధ సంస్థ, ట్రస్టు ప్రతినిధులు, భక్తుల సహకారంతో ఈనెల 22 నుంచి అక్టోబర్ 4 వరకు దేవి శరన్నవ రాత్రి మహోత్సాలు అత్యంత వైభవముగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని దేవాలయ అర్చకులు నాగిళ్ళ శంకర్ శర్మ, వేద పండితులు నాగిళ్ళ షణ్ముఖ పద్మనాభ అవధాని, దేవాలయ అభివృద్ధి కార్యకర్తలు నీలారపు రాజ్ కుమార్, బంగారు సదానందం కలిసి ఆహ్వానించారు.

# గొర్రెల పంపిణీ కుంభకోణంలో బాధితులకు ఈడీ నోటీసులు

అక్షరదర్బార్, హైదరాబాద్: గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ ) వేగవంతం చేసింది. ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఇందులో భాగంగా ఈ కుంభకోణంలో నష్టపోయిన బాధితులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొంది. మొయినుద్దీన్ అనే వ్యక్తి, అతని అనుచరులు ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి సుమారు రూ.2 కోట్ల మేర మోసం చేసినట్లు ఈడీ గుర్తించింది. రైతులకు చెల్లించాల్సిన డబ్బును ప్రభుత్వ అధికారుల సహకారంతో బినామీ ఖాతాలకు, సొంత ఖాతాలకు బదిలీ చేసుకున్నట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. ఈ మోసంలో నష్టపోయిన బాధితుల నుంచి మరిన్ని వివరాలు సేకరించేందుకు ఈడీ సిద్ధమవుతోంది.




# ఎన్ హెచ్ఆర్సీ మండల కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్ శాయంపేట : జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్ హెచ్ ఆర్ సి)రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షులు బండి సదానందం,జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన మహేష్ ఆధ్వర్యంలో జాతీయ మానవ హక్కుల సంఘం శాయంపేట కమిటీని ఎన్నుకోవడం జరిగింది.మండల అధ్యక్షులుగా ఏదుల రాజశేఖర్, శాయంపేట మండల ప్రధాన కార్యదర్శిగా రేణుకుంట్ల పృధ్వీరాజ్ ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

# ఎల్కతుర్తి జంక్షన్ పనులు పూర్తి కావాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

అక్షరదర్బార్, హనుమకొండ: ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులలో భాగంగా మిగిలిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన అభివృద్ధి పనులు, ఇంకా పూర్తి కావాల్సిన అభివృద్ధి పనుల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ జంక్షన్ సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ లైట్ల ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, స్థానిక తహసిల్దార్ ఏవీఎస్వీ ప్రసాద రావు, ఎంపీడీవో విజయ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915